పని కావాలంటే పైసలివ్వాల్సిందే..!

- ఫైల్ కదలాలంటే మధ్యవర్తులు ఉండాల్సిందే..
- ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నా పట్టించుకునే వారేరి?

మందలపల్లిలో ఓ నర్సరీకి తరలించిన ఎర్రమట్టి

దమ్మపేట, డిసెంబర్ 30 : ఏజెన్సీ మండల కేంద్రమైన దమ్మపేటలోని రెవెన్యూ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఆ శాఖలో ఏ పని కావాలన్నా కాసులు ఇస్తేనే పని పూర్తవుతుందనే ఆరోపణలు సైతం బహిర్గతమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా అది పైరవీకారులతోనే సాధ్యమనే వాదనలు మండలవ్యాప్తంగా పలు పత్రికల్లో వచ్చిన కథనాలతో నిజమయ్యాయి. తాజాగా 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సోమవారం 'దళారులకు అడ్డాగా దమ్మపేట రెవెన్యూ ఆఫీస్' అనే కథనం ప్రచురితం కావడంతో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇప్పటికే కార్యాలయంలో సర్వేయర్ ఓ రైతు భూమికి సంబంధించి సర్వే నిమిత్తం రూ.1.50 లక్షలు డిమాండ్ చేసి రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్న సంగతి పాఠకులకు విదితమే. ఇంతటితో ఈ అవినీతి ఆగేలా లేదని మరికొన్ని సమస్యలు రుజువు చేస్తున్నాయి. కొందరు బాధితులు అధికారులకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించి తమ పనులు కావాలని చెప్పారని, ఫోన్ సంభాషణల రికార్డులు సైతం బయటకు వచ్చిన ఘటలనపై పలువురు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఏ ఫైల్ కదలాలన్నా.. ఏ పని కావాలన్నా.. సమస్యను బట్టి దానికి పైరవీకారులు వెలకడితే ఆ శాఖలో అధికారులు ఆ పనిని చేసేంతగా ఈ కార్యాలయంలో పనులు ముందుకు సాగుతున్నాయనే ఆరోపణలూ లేకపోలేదు. ప్రభుత్వ భూములను సైతం పైరవీకారుల మాటలు విని అధికారులే మాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయాన్ని విజిట్ చేసిన క్రమంలో ఇక్కడ జరిగే అవినీతికి సంబంధించి కొందరు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా అధికారుల పనితీరుపై అసహనం సైతం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మండలంలో కోట్లాది రూపాయలతో మట్టి వ్యాపారం చేస్తున్న నర్సరీలకు రాత్రికి రాత్రే ఎర్రమట్టి తోలకాలు సాగిస్తూ అధికారులకు ముడుపులు చెల్లిస్తూ గుట్టలను మాయం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత రెవెన్యూశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. మందలపల్లి శివారులో ఓ గుట్ట నుంచి ఈ అక్రమ మట్టి వ్యాపారం రాత్రిళ్లు యథేచ్ఛగా నిర్వహిస్తూ ఇప్పుడు ఆ గుట్టనే మాయం చేశారంటే ఎంతమేరకు వ్యాపారం జరుగుతుందో ఉన్నతాధికారులే గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ కట్టడి చేయాల్సిన తహసీల్దార్ ఇటీవల సెలవుపై వెళ్లగా అసలు మళ్లీ వస్తారా... లేక మరో అధికారి వచ్చిన తర్వాతైనా కార్యాలయంలో అవినీతికి ఫుల్‌స్టాప్ పెడతారో.. లేదో వేచిచూడాల్సిందే.

ముక్కోటికి ట్రైబల్ మ్యూజియం సిద్ధం చేయాలి

- ఐటీడీఏ పీవో రాహుల్

మ్యూజియం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబర్ 30: ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున ట్రైబల్ మ్యూజియానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు, విద్యుత్ పనులు పూర్తిచేసి సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ట్రైబల్ మ్యూజియం వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. జనవరి 9, 10 తేదీల్లో ముక్కోటి సందర్భంగా జరిగే తెప్పోత్సవం, వైకుంఠ ద్వారదర్శనానికి భక్తులు అధికసంఖ్యలో రానున్నందున ట్రైబల్ మ్యూజియం సందర్శించేలా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, మ్యూజియం ఎదురుగా స్వాగత బోర్డులు ఏర్పాట్లు చేయాలని అన్నారు. మ్యూజియం సందర్శనకు వచ్చినప్పుడు సాంప్రదాయ దస్తులు ధరించిన స్త్రీలు స్వాగతం పలికేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. పర్యాటకులు మ్యూజియం వద్ద సెల్ఫీలు దిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మ్యూజియం ఏర్పాట్లను పూర్తిచేసి విద్యుద్ధీపాలతో అలంకరించాలని, బోటింగ్ షికారు, ట్రైబల్ కల్చర్ క్రీడా స్థలాల్లో ఏమైనా మైనార్టీ పేర్లు ఉంటే వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, డీఈ హరీశ్, మలేరియా అధికారి స్పందన, జేడీఎం హరికృష్ణ, ఈవో జీపీ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి: పీవో

భద్రాచలం, డిసెంబర్ 30: గిరిజన గ్రామాల్లో ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్న దృష్ట్యా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పట్ల వార్డెన్లు, హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. పిల్లలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బారులో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీడీఏ అధికారులు డేవిడ్‌రాజ్, మణెమ్మ, రవీంద్రనాథ్, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

కుట్టు శిక్షణ కేంద్రాన్ని సమితి అధ్యక్షురాలు

రామవరం, డిసెంబర్ 30: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోగ సత్తుపల్లిలోని జలగం నగర్ కాలనీ, పీవీ నరసింహారావు కాలనీలో సోమవారం ఉచిత వృత్తి శిక్షణ తరగతులను ఏరియా సేవా అధ్యక్షురాలు మధుర వాణి శాలెంరాజు సోమవారం ప్రారంభించారు. సేవా బాధ్యులు భవానీరవీందర్, జేవీఆర్‌వోసీ సీనియర్ పీవో దేవదాస్, మున్సిపల్ కౌన్సిలర్ నాగలక్ష్మి, కో-ఆర్డినేటర్ సాగర్ పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఏడోదశ సీఈకి వినతి

పాల్వంచ, డిసెంబర్ 30: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఈఈ-1104 నాయకులు సోమవారం ఏడోదశ సీఈకి వినతిపత్రం ఇచ్చారు. అస్తవ్యస్తంగా ఉన్న కేటీపీఎస్ కాలనీలోని రోడ్లను మరమ్మతు చేయాలని కోరారు. కేశబోయిన కోటేశ్వరరావు, యాకూబ్, రాజేంద్ర, గండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే తేదీని పొడిగించాలి

మాట్లాడుతున్న భానుచందర్

టేకులపల్లి, డిసెంబర్ 30: ఇందిరమ్మ ఇండ్ల సర్వే తేదీని పొడిగించాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సోముల భానుచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాటిలో అనేక మంది పేర్లు మిస్సవ్వడం, యాప్‌లో ఇంటిపేర్లు తప్పుగా ఉన్నాయనియి వాటిని సరిచేయాలన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ చేయడంలో లోపాలు లేకుండా పేర్లు నమోదు కాని వాళ్ల కోసం నూతన దరఖాస్తులను పెట్టుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. వాటికోసం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి

అశ్వారావుపేట, డిసెంబర్ 30: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం రాములుపై భక్తి ముసుగులో దాడి చేసిన మతోన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. దాడికి వ్యతిరేకంగా స్థానిక సంత మార్కెట్ వద్ద సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, ఏసు, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

పోడు పట్టాల విషయంలో నిర్లక్ష్యం వీడాలి

అధికారులకు సమస్యను వివరిస్తున్న సురేందర్‌రావు

టేకులపల్లి, డిసెంబర్ 30: అర్హత కలిగి పోడు సాగు చేస్తున్న రైతులను గుర్తించి రైతుబంధు పథకం కింద నగదు వేసిన రైతులకు పట్టాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌రావు అన్నారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీవో కార్యాలయానికి టేకులపల్లి మండలం రామచంద్రుని పేట గ్రామానికి చెందిన గిరిజన రైతులకు రైతుబంధు వస్తుంది కాని వారికి పట్టా పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు.

మృతుల కుటుంబాలకు రేగా పరామర్శ

పరామర్శిస్తున్న రేగా కాంతారావు

పినపాక (కరకగూడెం), డిసెంబర్ 30 : మండలంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పర్యటించారు. ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వర్మ, నాయకులు కోలేటి భవానీశంకర్, పొనుగోటి భద్రయ్య, కటకం గణేష్, బుస్సి శ్రీనివాస్, అనిపెద్ది బాబూరావు, బండగొర్ల సాంబశివరావు, జంపయ్య పాల్గొన్నారు.





భద్రాద్రి రామయ్యకు రూ.1.71 కోట్ల ఆదాయం

హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం, డిసెంబర్ 30 : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి నవంబర్ 7నుంచి ఈ నెల 30వ తేదీ వరకు (53 రోజులు) రూ.1,71,20,321 హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎల్ రమాదేవి తెలిపారు. సోమవారం ఆలయంలో హుండీలను తెరిచి ఆలయ ఆవరణలో లెక్కించారు. రూ.1,71,20,321 నగదు, 92 గ్రాముల బంగారం, కేజీ 485 గ్రాములు వెండి వచ్చిందన్నారు. అదేవిధంగా 923 అమెరికన్ డాలర్లు, 165 ఆస్ట్రేలియన్ డాలర్లు, సింగపూర్ 12 డాలర్లు, కెనడా 20 రిగ్నేట్స్, ఇంగ్లాండ్‌కు చెందిన ఐదు పౌండ్‌లు, 10 యూరోలు, థాయిలాండ్‌కు చెందిన 20 బట్స్, మలేషియాకు చెందిన 20 రిగ్నేట్స్ లభించాయన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

మణుగూరు టౌన్, డిసెంబర్ 30: ఆర్టీసీ మణుగూరు డిపో ఆధ్వర్యంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు డిపో పరిధిలోని కరకగూడెం, పినపాక, బయ్యారం, అశ్వాపురం మండలాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలను మంగళవారం సాయంత్రం 3:00 నుంచి 4:00 గంటల మధ్యలో 9959225963 నంబర్‌కు డయల్ చేయాలని చెప్పారు.

యోగాతో ఒత్తిడి దూరం

దుమ్ముగూడెం, డిసెంబర్ 30: యోగా సాధనతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని, ప్రశాంతంగా ఉండవచ్చని దుమ్ముగూడెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. కళాశాలలో సోమవారం 'హార్ట్‌ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ లైఫ్ పొటెన్షియల్ హెల్ప్ ప్రోగ్రాం'లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా ప్రశాంతంగా ఉంటే.. ఏకాగ్రతతో చదవగలుగుతారని అన్నారు. అందుకే, క్రమం తప్పకుండా ఉదయం యోగా చేయాలన్నారు. తెలుగు అధ్యాపకుడు వరరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సైకిళ్లతో విద్యార్థులు

ములకలపల్లి, డిసెంబర్ 30: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాతలు జగలం సతోశ్‌కుమార్, జలగం చంద్రశేఖర్ ఆర్థిక సాయంతో అందించిన సైకిళ్లలను తిమ్మంపేట గ్రామస్తులు, న్యాయవాది తాండ్ర వెంకట కృష్ణరావు సోమవారం సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు మురళికృష్ణ, రాజేందర్, హెచ్ఎం బీ శంకర్, గ్రామస్తులు తాండ్ర ప్రభాకర్‌రావు, జోగయ్య, భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు నిర్మల, సురేశ్, ముత్తేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ఇల్లెందు, డిసెంబర్ 30: ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలోరి రౌడీషీటర్లకు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం తాగి ఎటువంటి గొడవలకు పోవద్దని రౌడీషీటర్లు గొడవలు చేస్తే గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డీజే సౌండ్, రోడ్డుపై అధిక స్పీడ్‌తో ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు సూర్య, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు సూచనలు చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చేదాకా వదిలిపెట్టం

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

మాట్లాడుతున్న అల్లం నారాయణ

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చేంత వరకు వదిలిపెట్టేది లేదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం కొత్తగూడెం పీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ కోసం కొట్లాడింది టీయూడబ్ల్యూజే మాత్రమేనని అన్నారు. ఆంధ్రా పెత్తందారీ యూనియన్లతో ఒరిగిందేమీ లేదని అన్నారు. అధికారంలో ఉన్న ప్రస్తుత యూనియన్.. నేటికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, ఉపాధ్యక్షులు హజారే, యోగానంద్, విష్ణు, రమణ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

గుండాల, డిసెంబర్ 30: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం 643 గురుకులాల్లో 5వ తరగతిలో సీట్ల భర్తీ కోసం 6, 7, 8, 9, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుండాల గురుకుల గిరిజన హెచ్ఎం విప్పా సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఆధార్, ఆదాయ, కుల ధృవీకరణ, స్టడీ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకోసం 6302299811 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీవో ప్రసాదరావు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 30: గ్రామ పంచాయతీ అభివృద్ధి 2025-2026 ప్రణాళికపై సోమవారం మేజర్‌పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో ప్రసాదరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ఈవో కె శ్రీరామ్మూర్తి ప్రణాళిక అంశాలను చదివి వినిపించారు. పట్టణంలోని దొంతికుంట చెరువులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి అభివృద్ధి దిశగా చెరువును తీసుకురావాలని గ్రామస్తులు కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాని ఎంపీవో తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్ రీనాతో తనిఖీలు

డాగ్ రీనాతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అశ్వాపురం, డిసెంబర్ 30: గంజాయి నియంత్రణలో భాగంగా సోమవారం మండలంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ రీనాతో సీఐ అశోక్‌రెడ్డి సిబ్బందితో సోదాలు చేపట్టారు. మండలంలో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అనుమానిత ఇళ్లు, మారుమూల ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 30: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దు

చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 30: ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి ప్రియాంక హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎర్రగుంటలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని లేనట్లయితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చంద్రుగొండ, డిసెంబర్ 30: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలండర్‌ను మండలంలోని దామరచర్ల గ్రామంలోగల ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీడీవో అశోక్, ఏవో వినయ్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ సభ్యులు

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జూలూరుపాడు, డిసెంబర్ 30 : సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఏవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని వెంగన్నపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇల్లంగి సాకేత్(21) తన తండ్రి సంగీతరావును కొత్త సెల్‌ఫోన్ కొని ఇవ్వాలని, తన ఫ్రెండ్స్ అందరూ కొత్తఫోన్లు వాడుతున్నారని వారంరోజులుగా అడుగుతున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని తాను వాడుకుంటున్న ఫోన్ తీసుకొమ్మని చెప్తూ వచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన సాకేత్ తండ్రి హమాలీ పనికి వెళ్లగా, తల్లి పని నిమిత్తం పక్కింటికి వెళ్లిన సమయంలో తన గదిలోకి వెళ్లి ఇనుప కడ్డీకి తాడుతో ఉరివేసుకొన్నాడు. కొంత సమయం తర్వాత తల్లి ఇంట్లోకి రాగా గదిలో వేలాడుతున్న కొడుకును చూసి కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చి యువకుడిని దింపి చూడగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. కొడుకు మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరుల కంట తడిపెట్టించింది. సంగీతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్సై రవి తెలిపారు.

గిరిజన వంటకాల తయారీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, డిసెంబర్ 30: భద్రాచలం ట్రైబల్ మ్యూజియం వద్ద స్నాక్స్, చాట్, గిరిజన సాంప్రదాయ వంటకాలు, ఇతర వంటకాల తయారీలో ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 నుంచి ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశమందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని, అదేరోజు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ఒంటేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.